

# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## అక్కినేని శ్రీకర్ ప్రసాద్



నేను....

కొత్తకొత్త యువ దర్శకులతో చేరి నాకు తగ్గ పాఠాలు నేర్చుకుంటూనే ఉన్నాను. ఈనాటికీ నేనొక విద్యార్థినే. ఎల్.వి.ప్రసాద్ మా పెదనాన్న. అక్కినేని సంజీవి మా నాన్న. సినిమాయే కుటుంబ వృత్తి. పెదనాన్న, మామయ్య, ఇలా అందరూ చెన్నైకి రావడంతో, వాళ్ళతోపాటు మేమూ తర్వాత్తర్వాత వచ్చి ఇక్కడ సెటిలయ్యాం. నేను పుట్టింది చెన్నైలోనే. అమ్మ రాధ, అక్క పంకజ. అడయార్ సెయింట్ మైఖేల్ అకాడెమీలో స్కూలు చదువు. నాన్న సినిమా ఎడిటర్. ఏడెనిమిది చిత్రాలకు దర్శకుడు. ఎల్లప్పుడూ ఇంట్లో సినిమా, సినిమా అంతే.

అయితే, ఎందుకో తెలియదుగానీ పన్నెండో యేడు వచ్చేంతవరకు నాకూ, సినిమాకూ ఎలాంటి సంబంధమూ లేకుండా ఉండిపోయాను. సినిమా చూసినట్టు కూడా అంతగా జ్ఞాపకం లేదు.



అప్పుడు నాకు తెలిసినవన్నీ రెండే విషయాలు. ఒకటి క్రికెట్, రెండోది లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు చదవడం. అమ్మ, అక్క అందరూ అలా ఉండాలనే అనుకున్నారు.

కారణం, నాన్న ఇంట్లో ఉండడం మేము చూసి ఎరగము, ఎప్పుడు చూసినా స్టూడియోలోనే ఉండేవారు. అందువల్లే నేను సినిమా రంగానికి వెళ్ళకూడదని అమ్మ, అక్క ఆశించారు.

ఇలా జీవితం సాగుతున్నప్పుడు ఇంట్లో ఒక విషాద ఘటన. మా పెద్ద అక్కయ్య ఒక ప్రమాదంలో మరణించారు.



ఆ శోకం నుంచి మా కుటుంబం బయటపడడానికి మా ఆలోచనలను మరోవైపు మళ్ళించాము.

సినిమా నన్ను ఆకర్షించింది అప్పుడే. ఫ్రెండ్ ఇంట్లో అప్పుడే టి.వి కొన్నారు. దూరదర్శన్‌లో సినిమాలు వేయడం ప్రారంభించారు. నేనూ సినిమాలు చూడడం ప్రారంభించాను.

ఆ సమయంలోనే +2 విధానం వచ్చింది. ఇంట్లో నన్ను కామర్స్ చదివించాలని ఆశించారు. అక్క బ్యాంకు ఉద్యోగం చేయడంవల్ల, నన్నుకూడా అదే మార్గంలో నడిపించడానికి చూశారు. నాకేమో లిటరేచర్ చదవాలి, రాయాలి అని ఆశ. అందుకనే న్యూ కాలేజీలో ఇంగ్లీషు లిటరేచర్ తీసుకున్నాను.

కాలేజీ చదువు పూర్తయింది. ఢిల్లీలో జర్నలిజం చదువుదామని అప్లై చేశాను. "ఇంటర్వ్యూ వచ్చేంతవరకు ఇంట్లో ఎందుకు ఊరికినే ఉంటావు.. నాతో రా" అని నాన్నే నన్ను ఎడిట్ రూంకు తీసుకువెళ్ళారు.

సినిమాకి తీసిన సీన్లు అక్కడికి వస్తాయి. వాటిని నిక్కచ్చిగా ఎడిట్ చేసి, కూర్చి ఒక కథగా తయారుచేస్తున్నారు. అంతకు క్రితమే సాహిత్యం చదివే అలవాటు ఉండడంతో, ఈ కథలు తయారు చేయడం నచ్చింది.

నాన్న ఎన్నడుగానీ నాకు పాఠం నేర్పే ఉపాధ్యాయుడిగా ఉండలేదు. "నువ్వే చూసి అర్థం చేసుకుని నేర్చుకో" అనేలాగానే మాతో వ్యవహరించేవారు. ఎందులోనైనా మా ఇష్టమే ముఖ్యం అని వదిలేసేవారు.



అక్కడ వున్న నాన్న అసిస్టెంట్లకు నేను చిన్నప్పటి నుంచే తెలుసు. కూర్చోబెట్టి నేర్పించడం ప్రారంభించారు.

అప్పుడే 70 ఎం.ఎం పరిచయమవుతోంది. నాన్న, పెదనాన్న అందరూ ఆ పనుల్లో తలమునకలుగా ఉన్నప్పుడు నేనిక్కడ ఎడిటింగ్ టేబుల్లో ఉన్నాను.

ఏదో మూడు నెలలేకదా అని ఇంట్లో అనుకుంటున్నారు. అక్క ఫోన్ చేసి బ్యాంకు ఉద్యోగానికి అప్లై చేయమని చెప్పారు. నేను చెయ్యనే లేదు. జర్నలిజం కోర్సుకు అప్లై చేయడంతో సరి.

మూడు నెలలు ఎడిటింగ్ రూంలో కొంత అలవాటు కావడంతో, నాన్నతో కలిసి పనిచేయడం ప్రారంభించాను. రోజురోజుకూ చాలా విషయాలు నేర్చుకోవడం సాధ్యమయింది. ఇవాళలా కాదు, అప్పుడు నెగిటివ్‌ను కట్ చేసి పేస్ట్ చెయ్యాలి. ఎంతసేపు పనిచేస్తున్నామని కూడా తెలియదు. రెండురోజుల తరువాతే ఇంటికి వెళ్ళడం కూడా జరిగేది.

నాలుగయిదేళ్ళు ఇలాగే గడిచిపోయాయి. ప్రప్రథమంగా అస్సాం, ఒరిస్సా భాషల సినిమాలను నేనే ఎడిట్ చేసి ఇవ్వడం ప్రారంభించాను అన్నీ కూడా అనుభవ పాఠాలే. ఆ కారణం చేతే ఇప్పుడున్న దర్శకులతో కలిసి పనిచేయడం వీలవుతోంది. పలుభాషల్లో పనిచేయడం సాధ్యమవుతోంది.





ఇక్కడ నాకు స్నేహితులు కూడా ఎక్కువయ్యారు. ఆ విధంగానే సంతోష్ శివన్, అతని సోదరుడు సంగీత్ శివన్ స్నేహం కుదిరింది. సంతోష్ శివన్ డాక్యుమెంటరీ ఒకదాన్ని నేను ఎడిట్ చేశాను. అతనే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా 'రాఖ్' అనే చిత్రాన్ని తీశారు. అందరూ కొత్త ముఖాలు. సంతోష్ శివన్‌కూ తొలి చిత్రం. నన్నూ ఎడిటింగ్‌లో చేర్చారు. అమీర్‌ఖాన్ హీరో. అప్పుడు ఆయన పెద్ద హీరో కాదు.

ఆ సమయంలోనే, నాన్న వరుసగా పనిచేసిన జగపతి పిక్చర్స్ వి.బి.రాజేంద్రప్రసాద్, తన కుమారుడు జగపతిబాబును తెలుగులో హీరోగా పరిచయం చేయడానికి నిర్ణయించారు. ఆ చిత్రంతో నన్ను కూడా విడి ఎడిటర్‌గా ఇంట్రడ్యూస్ చేయాలని ఆశించారు.

ఒకే సమయంలో రెండు చిత్రాలకు పనిచేశాను. 'రాఖ్' చిత్రం జాతీయ అవార్డు జాబితాలో వచ్చింది. మరుసటిరోజు న్యూస్ పేపర్ చూసి, మా పక్కింటి తంగి అక్క వచ్చి తలుపు తట్టి లేపి నాకు ఉత్తమ ఎడిటర్ అవార్డు లభించినట్టు చెప్పారు.




అంత సంతోషం, మళ్ళీమళ్ళీ చాలా అవార్డులు అందుకున్నా రాలేదు. అంతవరకూ సినిమాలో అలాంటి జాతీయ అవార్డు ఉందన్నదే తెలియదు. మొదటి చిత్రానికే అవార్డు అందుకున్నాను. అయితే, దాని సీరియస్‌నెస్ నాకప్పుడు అర్థంకాలేదు. ఇండస్ట్రీకి అర్థమయింది. చాలామంది వెతుక్కుంటూ వచ్చి ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

సాధారణంగా కమర్షియల్ చిత్రాలకు జాతీయ అవార్డులు లభించవు. 'రాఖ్' ఒక గ్యాంగ్‌స్టర్ చిత్రం. దానికి నేషనల్ అవార్డు. ఇది సినిమా రంగానికి కొత్త ఒరవడిని తీసుకు వచ్చింది.




చాలా చిత్రాలు, చాలా భాషలు. ఇంతవరకు 17 భాషల్లో ఎడిటింగ్ వర్క్ చేసి వున్నాను. ఇలా ఎవరూ చేయలేదని 'లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించాను.

తమిళంలో మొదటి చిత్రం 'యిరొండు యిరాగ'. మిత్రులు సుష్మా ద్వారా ఫస్ట్ ఎంట్రీ. అజిత్‌తోనూ చాలా చిత్రాలు చేశాను.

అప్పుడు మేము మూవియోలా టెక్నాలజీతో ఎడిటింగ్ చేశాము. తరువాత స్టీన్‌బెక్. ఈ మధ్యకాలంలో ఏవిడ్ టెక్నాలజీ వచ్చింది.

ఇది – లీనియర్ ఎడిటింగ్ సిస్టం. కంప్యూటర్ కూడా జత చేయవచ్చు. చాలా ఎఫెక్ట్స్ ఇవ్వచ్చు. సమయం చాలా ఆదా అవుతుందని తెలిసి నేనూ ఆ ఎక్విప్మెంట్ కొన్నాను.

అయితే, నేను కొనడానికి ముందే కమల్‌హాసన్ గారు కొని, దాంతో 'మహానది' చిత్రం ఎడిట్ చేసి, కొన్ని సమస్యలన్నిటినీ అధిగమించి వచ్చారని చెప్పారు. అప్పుడే దాని ధర 50లక్షల రూపాయల వరకు ఉండేది. మా ఇంటి పత్రం పెట్టి కొన్నాను.

అంతవరకు అందరికీ ఆ టెక్నాలజీ మీద మితిమించిన ఆసక్తి ఉండేది. అయితే, సమస్య ఉందని తెలిసిన పలువురు దాన్ని వద్దని చెప్పారు.

ఏం చేయాలో తెలియలేదు. పెద్ద మొత్తాన్ని ఇందులో పెట్టేశాను. అప్పుడు దర్శకులు రాఘవేంద్రరావుగారు, "పెళ్ళిసందడి" చిత్రం ట్రైలర్‌ను కట్ చేయమని చెప్పారు.

అప్పటివరకు, సినిమాలో నాలుగు సీన్లు తీసుకుని వాటిని కట్ చేసి కలిపి ఇచ్చేవారు. అయితే, నేను ఏవిడ్ ఎక్విప్మెంట్ ఉపయోగించి చాలా ఎఫెక్ట్స్ ఇచ్చాను. సూపర్‌హిట్. వరుసగా ట్రైలర్ పనులు వచ్చాయి. నాకూ పెట్టిన మొత్తం కొంచెం కొంచెంగా రావడం ప్రారంభమయింది.

మూడేళ్ళు వరసగా సినిమాల ట్రైలర్లు ఎడిట్ చేశాను. అలాగే ఒకటి రెండు చిత్రాలు చేయడం ప్రారంభించి, వాటిలో 'నౌకా చరిత్రం', 'ది టెర్రరిస్ట్' చిత్రాలకు జాతీయ అవార్డులు లభించడంతో ఏవిడ్ బూస్ట్ అయింది. ఈ




సమయంలో మణిరత్నానికీ, నాకూ ఒక కామన్ ఫ్రెండ్ ద్వారా పరిచయం అయ్యింది. మణిరత్నం మా స్టూడియోకు తరచూ వచ్చేవారు. ఏ కొత్త ఎక్విప్మెంట్, టెక్నాలజీ వచ్చినా, ఆయన పనికోసం వచ్చేవారు. అలా మేము స్నేహితులమయ్యాం. 'అలైపాయుదే' చిత్రం కుదిరింది. అక్కడ ప్రారంభమయిన ప్రయాణం, ప్రస్తుతం 'పొన్నియన్ సెల్వన్' చిత్రం వరకూ కొనసాగుతూ వుంది.

మా నాన్న ఈరోజు సంపాదించడానికి ఈరోజే పరిగెత్తాలనే మనస్తత్వం కలవారు. అయితే నేను కాస్త ఇల్లు, సేవింగ్ ఇలా ఆలోచించేవాణ్ణి. ఇందువల్లే నాన్నకు ఇంతవరకు పెద్దగా సేవింగ్స్ అంటూ ఏవీ లేవు. డబ్బు సంపాయించేవారు. దాన్ని మళ్ళీ సినిమాల్లోనే పెట్టేవారు.

నేను దాన్ని సరిదిద్దుకున్నాను.

1989లో ఇంట్లో చూసి నిర్ణయించిన బంధువుల అమ్మాయే అనుపమ. అమ్మ, అక్క అందరూ చూసివచ్చాక, నేను చూశాను. నచ్చడంతో పెళ్ళయింది.

సినిమా పనులు ఎలా ఉంటాయో మీకు తెలుసు. రాత్రింబవళ్ళు పనులుంటాయి. సగం రోజులు ఇంట్లోనే ఉండను. అన్నింటినీ వాళ్ళు దీటుగా నెగ్గుకొస్తున్నారు. అమ్మ, ఆ తరవాత మా ఆవిడ కూడా ఎంతో త్యాగం చేశారని చెప్పవచ్చు.

మా అబ్బాయి అక్షయ్ అక్కినేని, హిందీలో 'పిజ్జా' చిత్రానికి దర్శకత్వం చేశాడు, ప్రస్తుతం వెబ్ సిరీస్ పనులలో ఉన్నాడు.

కీర్తన, మా అబ్బాయి లయోలా కాలేజీలో ఒకే క్లాసు. స్నేహం ప్రేమగా పరిణమించి మాతో చెప్పారు. ఓకే చెప్పాం. పెళ్ళి జరిగింది.

ఎడిటింగుకు సంబంధించినంతవరకు, మనకని సమయం కేటాయించుకోలేని జీవితంగానే ఉంటుంది. అయితే, దానిని కూడా సరిచేసుకుంటూ, తగిన నిద్ర, జాగింగ్ అంటూ నన్ను నేనే దారిలో పెట్టుకున్నాను. క్రికెట్, పుస్తకం నాకు పెద్ద సహాయకారులు. వీకెండ్స్ లో క్రికెట్ ఆడేవాణ్ణి. ఇప్పుడు జాగింగ్, వ్యాయామం, భోజనంలో క్రమశిక్షణ అంటూ ఉన్నాను.

మీరు చేసే పనిని ఎల్లప్పుడూ అంకితభావంతో చేయండి. మీరు ఆశించే మార్గంలో కాకుండా, నచ్చని వేరు మార్గంలో కూడా కొన్ని సందర్భాలలో పయనించవలసిన పరిస్థితి రావచ్చు. చిన్న చిన్న మనస్తాపాలు కూడా ఏర్పడవచ్చు.



మీ చుట్టూ వున్న ప్రపంచాన్ని, నేర్చుకునే విద్యార్థిగానే ఉండాలి. అనుభవజ్ఞులైనవారో, కొత్తవారో ఎవరైనా ఈగో అవసరంలేదు. ఒక్కొక్క మనిషి వద్దా ఒక కొత్త విషయం నేర్చుకోవచ్చు.

దాన్నే ఇప్పటివరకు ఆచరిస్తున్నాను. అందువల్లే, వయోభేదం లేకుండా, వయసుతో సంబంధం లేకుండా అందరు దర్శకులతోనూ పయనించగలుగుతున్నాను.

**– షాలిని న్యూటన్**

**తెలుగు సేత: అంగేరి బాలసుబ్రహ్మణ్యం**

## కుంగుమం పత్రిక నుంచి పునర్ముద్రితం

COMMENTS